క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా ఆళ్ల రవీంద్రారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా గురువారం తన నివాసంలో కార్యకర్తలతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీ తరపున రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా నియమించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. పదవి ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు రవీంద్రారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4 వేల జీవాలకు నట్టల నివారణ మందు

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు గ్రామంలో చలప్పాలెం పశువైద్యశాల ఆధ్వర్యంలో గురువారం 4 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి ప్రారంభించగా, చలప్పాలెం పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి, ఏహెచ్‌ఏ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత



సాక్షి ఎఫెక్ట్..

చీమకుర్తి రూరల్: మండలంలోని పడమటి నాయుడుపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం తొలగించారు. కాలువ మొత్తం చెత్తాచెదారంతో నిండి పారిశుధ్యం లోపించడంపై బుధవారం సాక్షి దినపత్రికలో 'పారిశుధ్యం అస్తవ్యస్తం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన అధికారులు గురువారం ఉదయం డ్రైనేజీలో పూడిక తీయించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం

సంతనూతలపాడు: మండలంలోని చిలకపాడు హైస్కూల్లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు జీ రూప, బీ పద్మావతి, కే గోవింద్ కుమార్, పీవీ రమణయ్య, ఆర్.మాచర్లను గురువారం పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వప్నరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల, విద్యార్థుల అభ్యున్నతికి ఆయా ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు.

వారాహి అలంకారంలో అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలోని జగదాంబ అమ్మవారికి వారాహి నవరాత్రులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు అమ్మవారిని ఉన్మత్త వారాహి అలంకారంలో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

కొమరోలు: మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య గురువారం పంపిణీ చేశారు. హిందీ కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు పాఠశాల హెచ్‌ఎం పద్మజకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జులై 9న ఆశావర్కర్ల సమ్మె

గిద్దలూరు రూరల్: దేశవ్యాప్తంగా జులై 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మీ అన్నారు. పట్టణంలోని విటా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో గురువారం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఆచరణలో పెట్టడం లేదన్నారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయినా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఐక్యమంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, థామస్, నూర్జహాన్, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

విజయ వారాహి అమ్మవారికి హోమాలు



చండి హోమంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో విజయ వారాహి అమ్మవారు

ఒంగోలు మెట్రో: వారాహి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గురువారం ఒంగోలు నగరంలోని బాలాజీరావుపేటలోని వెలసిన అంకమ్మ, పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ, కనకదుర్గ పరమేశ్వరి, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో విజయ వారాహి అమ్మవారికి అభిషేకాలు అర్చనలు, చండీ హోమాలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా దుర్గా పరమేశ్వరి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు జొన్నలగడ్డ అర్చకులు వేద సాయిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. అనంతరం వేద పండితుల నిర్వహణలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం, ఆశీస్సులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సాహితీ లోకానికి రామకృష్ణ ఎనలేని కృషి



రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు

ఒంగోలు మెట్రో: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సాహితీ లోకంలో వంకాయలపాటి రామకృష్ణ ఎనలేని కృషి చేశారని ప్రముఖ రచయితలు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరంలోని గురువారం ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళ అభ్యుదయ సమితి కార్యాలయంలో కళామిత్ర మండలి తెలుగు లోగిలి జాతీయ సంస్థ, నరసం సంయుక్త నిర్వహణలో వంకాయలపాటి రామకృష్ణ వర్ధంతి సభ నిర్వహించారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ.. వంకాయలపాటి రామకృష్ణ కళామిత్ర మండలికి ప్రధాన కార్యదర్శి, ఎన్టీఆర్ కళాపరిషత్‌కు పీఆర్వోగా చేసిన సేవలు మరచిపోలేనివని చెప్పారు. రామకృష్ణ ఒక మంచి భర్తగా, మంచి తండ్రిగా, ఉత్తమ ఉపాధ్యాయుడుగా, సాహితీవేత్తగా బహుముఖీన పాత్రలు పోషించాడని గుర్తు చేసుకున్నారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ.. విద్యా వినయం, విద్వత్తు, విజ్ఞానం కలబోసిన అద్భుతమైన వ్యక్తిత్వం రామకృష్ణది అని కొనియాడారు. నరసం కార్యనిర్వహణలో రామకృష్ణ పాత్ర ఏనాడు మర్చిపోలేనిదని, అందుకే తన పేరిట ఒక సాహిత్య అవార్డును ప్రతి ఏడాది వారి కుటుంబ సభ్యులు అందిస్తున్నారని తెలియజేశారు. డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ నిజమైన మానవత్వం ఉన్న వ్యక్తిగా, స్త్రీలపట్ల గౌరవభావంతో, ఎల్లప్పుడూ విద్యార్థులు పట్ల ప్రేమాభిమానాలతో ఉండే గొప్ప వ్యక్తి అని సంస్కారవంతుడని, కళామిత్రమండలి జాతీయ స్థాయికి ఎదిగే క్రమంలో రామకృష్ణ పాత్ర ఎంతో శ్లాఘించదగినదని పేర్కొన్నారు. సభ ప్రారంభానికి ముందు రామకృష్ణ చిత్రపటానికి అతిథులు, రచయితలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు భార్య జయలక్ష్మి, కుమార్తెలు కళ్యాణి, బిందు, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు కుర్రాప్రసాద్ బాబు, ఓరుగంటి ప్రసాద్,యం.సూర్యకుమారి,మిడసల మల్లికార్జునరావు రచయితలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



మద్దిపాడులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ రఘుబాబు

మద్దిపాడు: మండలంలోని అన్నంగి, దొడ్డవరం, ఇనమనమెళ్లూరు, కీర్తిపాడు, రాచవారిపాలెం, మద్దిపాడు, మల్లవరం గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఈఓపీఆర్‌డీ రఘుబాబు గురువారం పర్యవేక్షించారు. ఈ నెలలో ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఆయా గ్రామాల ప్రజల నుంచి గ్రామ పరిశుభ్రత, చెత్త సేకరణ వంటి పనులపై ప్రతికూల అభిప్రాయాలు వచ్చిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఈఓపీఆర్‌డీ పర్యటించి పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. వచ్చేనెల 10వ తేదీ ఐవీఆర్ఎస్ కాల్స్‌కు గ్రామస్తుల నుంచి సానుకూల స్పందన వచ్చేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటికి వచ్చే హరిత రాయబారులకు అందించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందాం



మద్దిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, సిబ్బంది

మద్దిపాడు: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందామని ఎంపీడీఓ డీవీఎస్ ప్రసాద్, తహసీల్దార్ ఆదిలక్ష్మి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులతో మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. గంజాయి, నాటు సారా, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానవన రాయితీలను వినియోగించుకోవాలి

మద్దిపాడు: రైతులంతా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, రాయితీలను వినియోగించుకుని లబ్ధిపొందాలని ఒంగోలు సబ్ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారిణి సంధ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి వసతి, బిందు సేద్యం ఉన్న రైతులు పలు పథకాలకు అర్హులని తెలిపారు. రైతులకయ్యే ఖర్చులో 40 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా హైబ్రీడ్ కూరగాయలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.9600, బంతి, చామంతి, మల్లె మొక్కలకు ఎకరాకు 8 వేల రూపాయలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన ఆధారిత యూనిట్లు అయిన సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీ, సోలార్ పవర్ కోల్డ్ రూమ్, మొదలైన వాటికి 35 నుంచి 50 శాతం వరకూ రాయితీలు కల్పించామన్నారు. అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవడానికి పాసుపుస్తకంతో ఉద్యానవనశాఖ కార్యాలయంలో సోమ, గురువారాలలో సంప్రదించాలని తెలిపారు. 7995009758 ద్వారా కూడా సంప్రదించవచ్చని చెప్పారు.

పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

చీమకుర్తి రూరల్: మండలంలోని మువ్వావారిపాలెం పరిధిలో గల మూడు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గురువారం పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రి అందజేశారు. అప్పనబోయిన శ్రీనివాసరావు సమకూర్చిన వీటిని ఎంఈఓలు నరసింహారావు, శివాజీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు రవి, బొడ్డు కోటేశ్వరరావు, పూసపాటి వెంకటరావు, కుంచాల రాంబాబు, బక్కా సుధీర్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



నరజాముల తండా వీధుల్లో పర్యటిస్తున్న అధికారులు

● జేసీ గోపాలకృష్ణ

పుల్లలచెరువు: మండలంలోని నరజాముల తండాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని నరజాముల తండాలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డివిజన్ అటవీశాఖాధికారులతో కలిసి ఆయన పర్యటించారు. నరజాముల తండాలో గిరిజనులు ఇళ్ల కట్టుకునేందుకు నివేశన స్థలాలు, మంచినీటి బోర్లు వేసుకునేందుకు ఎదుర్కొంటున్న సమస్యలు, పెట్టుకున్న దరఖాస్తులను సంయుక్త విచారణ కోసం జిల్లా అధికారుల బృందం తండాలో గురువారం పర్యటించింది. తండాలోని పలు వీధులను సందర్శించి గిరిజనులతో మాట్లాడింది. అనంతరం గ్రామంలో రెవెన్యూ భూమి, అటవీ భూమి విషయంపై విచారణ చేసినట్లు జేసీ గోపాలకృష్ణ తెలిపారు. తండాలో పరిశీలించిన విషయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలను అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఎఫ్ఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు

బేస్తవారిపేట: మండలంలోని జెన్నివారిపల్లెలో గురువారం పోలేరమ్మ తిరునాళ్ల కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన కుంకుమ బండ్లతో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు తరలివెళ్లారు. మహిళలు బోనాలతో ఆలయం వద్దకు వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయం సందడిగా నెలకొంది.

అన్నవరప్పాడులో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంగోలు వన్‌టౌన్: నగరంలో కొన్ని ప్రాంతాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తరుచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈ సమస్య తలెత్తుతోంది. రోజులో రెండు సార్లకు పైనే విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అన్నవరప్పాడు, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో వ్యాపార సముదాయాలు, కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం 6.30 నిమిషాల నుంచి అరగంట పాటూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిని మరమ్మతు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారే కానీ, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం లేదు. కావున ఇప్పటికైనా శాశ్వత మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నేడు అర్ధవీడు మండల సమావేశం

అర్ధవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నేడు శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ మేడూరి వెంకటరావు అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో నర్సయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన సుబ్బారావు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సుబ్బారావు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు గురువారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. పలు బీసీలకు చెందిన సమస్యలను మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా విని ప్రతి నియోజకవర్గ కమిటీలు, మండల కమిటీలు పూర్తిస్థాయిలో నిర్మించాలని సూచించారని తెలిపారు.

చుండూరిని కలిసిన నాయకులు



నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబును శాలువతో సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఆర్టీఐ వింగ్ సెక్రటరీగా నియమితులైన సానికొమ్ము రామిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రారెడ్డి ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబుని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చుండూరి రవిబాబును శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్లకు తల్లికి వందనం ఇవ్వాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ వర్కర్లు

చీమకుర్తి: మున్సిపల్ వర్కర్లకు తల్లికి వందనం పథకంతో పాటు ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం చీమకుర్తిలో మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్యను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఇంజినీరింగ్ సిబ్బందికి జీవో నంబర్ 36 ప్రకారం జీతాలివ్వాలని కోరారు. వచ్చే నెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ భాగస్వాములవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పల్లాపల్లి ఆంజనేయులు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.

మాతృభాషా నైపుణ్యంతో మానసిక వికాసం



మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ

ఒంగోలు సిటీ: విద్యార్థులు మాతృభాషా నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే జీవితంలో రాణిస్తారని స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ అన్నారు. స్థానిక గద్దలగుంట పింగళి కోదండరామయ్య ఓరియంటల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు మాతృభాష నేర్చుకోవడంలో అనేక రకాల మెలుకువలు తెలియజేశారు. 14 సంవత్సరాల్లోపు విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని సెల్ ఫోన్లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. పదిసార్లు చదవడం కన్నా ఒక్కసారి రాస్తే అది కలకాలం గుర్తుండిపోతుందన్నారు. కావున విద్యార్థులు చదివిన ప్రతిదాన్ని రాసుకునే అలవాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ పద్మావతి, పీఈటీ సోమినేని సురేష్, రవికుమార్, స్టెప్ ఆఫీస్ ప్రతినిధి శ్రీనివాసరావు, నంన్నృత ఉపాధ్యాయులు ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో-2 ఇందిర ఆదేశించారు. ఆమె గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ పాలెం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థుల వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలకు ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోందని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనం అందజేయాలని, పరిశుభ్రమైన ప్రదేశంలో వంట తయారు చేస్తూ రుచికరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కూడా రోజూ రుచి చూడాలని చెప్పారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపటి నుంచి భాగవత సప్తాహ మహోత్సవాలు

ఒంగోలు మెట్రో: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి వికాస తరంగిణి సంస్థ ఒంగోలు ఆధ్వర్యంలో భాగవత సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయని నిర్వాహకులు హరిప్రసాదరావు, రంగనాథం, తులసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు శనివారం సాయంత్రం నుంచి జూలై 5వ తేదీ శనివారం సాయంత్రం వరకు ఒంగోలు గాంధీ రోడ్డు దక్షిణ బజారులోని పెద్ద రామానుజ కూటమి నందు జరుగుతాయన్నారు. భాగవతం మానవులకు మోక్షమును ప్రసాదించు గొప్ప గ్రంథమని, అహోబిల జీయర్ స్వామి వారి ప్రవచనాలతో విని తరించాలని భక్తులందరికీ ఆహ్వానం పలికారు.